టీడీపీలో పదవుల చిచ్చు

- అర్హులు కానివారికి పార్టీ అధ్యక్ష పదవులు
- కష్టకాలంలో అండగా నిలిచిన వారికి మొండిచేయి
- కోవూరు ఎమ్మెల్యే తీరుపై నాయకుల కినుక



బుచ్చిరెడ్డిపాళెంరూరల్: కోవూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో పదవుల చిచ్చు రాజుకుంది. ఇటీవల ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఐదు మండలాలకు అధ్యక్షులను నియమించారు. మొదటి నుంచి టీడీపీలో ఉన్నవారికి మొండిచేయి చూపి అర్హత లేని వారికి, పార్టీకి నష్టం కలిగించే వారికి పదవులు కట్టబెట్టడంపై తమ్ముళ్లు మండిపడుతున్నారు. ఇలా అయితే పార్టీ మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని సీనియర్ నాయకులు అంటున్నారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణాధ్యక్షుడిగా రియల్టర్ గుత్తా శ్రీనివాసులు, రూరల్ అధ్యక్షుడిగా ప్రజల సమస్యలు పట్టని జగదీష్‌ని నియమించడాన్ని ఆ పార్టీ నాయకులే వ్యతిరేకిస్తున్నారు. గౌరవాధ్యక్షుడిగా టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డిని నియమించడం కంటే యువకులకు అవకాశం కల్పిస్తే బాగుండేదని అంటున్నారు. అలాగే కొడవలూరుకు నాపా వెంకటేశ్వర్లునాయుడును నియమించారు. ఎంతో మంది సీనియర్ నాయకులు ఉన్నా నాపాకు పదవి ఇవ్వడాన్ని మరోవర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కోవూరుకు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డిని అధ్యక్షుడిగా నియమించారు. ఇతను పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి నమ్మినబంటు. ఆయన వర్గానికే సపోర్టు ఉంటుంది. మిగతావారిని అంతగా పట్టించుకోరు. సీనియర్ నాయకుడు చేజర్ల వెంకటేశ్వరరెడ్డిని సంప్రదించకుండా కోవూరు అధ్యక్ష పదవిని కట్టబెట్టడంతో ఆయన గుర్రుగా ఉన్నారని సమాచారం. ఇందుకూరుపేటకు ఏకొల్లు పవన్‌రెడ్డి, విడవలూరు మండలానికి శ్రీహరిరెడ్డిని నియమించారు. వీరెవరూ గతంలో ప్రజా సమస్యలపైన, టీడీపీ కార్యకర్తల సంక్షేమం, వారి ఉన్నతికి కృషి చేసిన దాఖలాలులేవు. వారి సొంత పనుల్లో వారు బిజీగా ఉంటూ టైమ్ పాస్ రాజకీయాలు చేస్తుంటారు. ఇలాంటి వాళ్లను పదవుల్లో నియమించడంతో మొదటి నుంచి టీడీపీ జెండా మోసిన వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు అనేక పోరాటాలు చేసిన తమను పక్కనపెట్టి వలస నేతలు, అర్హతలేనివారిని అధ్యక్ష పదవుల్లో నియమించడంతో ఏం చేయాలో, తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక తమ్ముళ్లు లోలోపల మదనపడుతున్నారు. కొందరు నేతలు నేరుగా టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది.

టీడీపీ నేతలను సంప్రదించకుండానే...

మండలాధ్యక్షులను నియమించే ముందు ఆయా మండలాలకు సంబంధించిన నాయకులతో సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఇలాంటి సమావేశాలు నిర్వహించలేదు. నెల్లూరులోని తన నివాసంలో ఒకరిద్దరు టీడీపీ నాయకులు, ఆయా మండలాలతో సంబంధం లేని నాయకులతో సమావేశమై వారు సూచించిన వారిని అధ్యక్షులుగా నియమించడం జరిగింది. ఐదు మండలాలకు సంబంధించి అధ్యక్షులను నియమించే సమయంలో కోడూరు కమలాకర్‌రెడ్డి పులువురు పేర్లను సూచించినట్లుగా తెలుస్తోంది. ఆయా మండలాల్లో టీడీపీ గురించి అవగాహనలేని, సంబంధంలేని వ్యక్తి సూచించిన వారిని ఎలా నియమిస్తారని తమ్ముళ్లు రగిలిపోతున్నారు. ఐదు మండలాల్లో మొదటి నుంచి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో ఉన్న టీడీపీ వర్గాన్ని అణచివేయడమే లక్ష్యంగా పదవులు కట్టబెట్టినట్లుగా తెలుస్తోంది. కోవూరులో టీడీపీ సీనియర్ నాయకుడు చేజర్ల వెంకటేశ్వరరెడ్డిని టార్గెట్ చేసినట్లుగా అర్థమవుతోంది. ఆయన వర్గం ఎమ్మెల్యే కార్యక్రమాలకు దూరంగా ఉంటోంది. దీంతో మొదటినుంచి టీడీపీ జెండాలు మోసినవారు ప్రస్తుతం క్రియాశీలకంగా వ్యవహరించడం లేదు. ఏమైనా సమస్యలొస్తే దినేష్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వీళ్లలో ఎవరి దగ్గరికి వెళ్లాలో కార్యకర్తలకు అర్థం కావడం లేదు. ఒకరిదగ్గరికి వెళ్తే మరొకరి దగ్గర గేట్లు మూసుకుపోయినట్లేనన్న చర్చ సాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో తమ్ముళ్లు కొట్టుమిట్టాడుతున్నారు.

ఎమ్మెల్యే కార్యక్రమాలకు దుమ్మా

గతంలో టీడీపీ కార్యక్రమాలకు విధిగా హాజరయ్యే సీనియర్ నాయకులు కార్యకర్తలు ప్రస్తుతం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కార్యక్రమాల్లో కనిపించడం లేదు. ఎమ్మెల్యే కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో జనాలను తరలించేందుకు టీడీపీ నాయకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యకర్తలను పట్టించుకోకపోవడం, వలస నేతల మాటలు నమ్మి పదవులు ఇస్తుండడంతో కార్యక్రమాలకు హాజరు కావడం లేదు. ముఖ్యంగా బుచ్చిరెడ్డిపాళెం రూరల్ ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలు జరిగే సమయంలో నగర పంచాయతీకి చెందిన కౌన్సిలర్లు, నాయకులు మండలంతో సంబంధం లేని నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి అనుచరులే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఆయా గ్రామాల్లో స్థానికంగా ఉన్న కార్యకర్తలు, నాయకులు మాత్రం దూరంగా ఉంటున్నారు.

సమాచారం కూడా కరువు

ఎమ్మెల్యే కార్యక్రమాలకు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలకు సమాచారం ఇచ్చేవారు కూడా కరువయ్యారు. ఎమ్మెల్యే కార్యక్రమాలు జరిగే సమయంలో ముందస్తుగా సమాచారం ఇవ్వడంలో మండల టీడీపీ నాయకులు పూర్తిగా విఫలమయ్యారు. మహానాడు కార్యక్రమానికి తరలివెళ్లే వాహనాలను ప్రారంభించడానికి ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వస్తున్నారన్న సమాచారం కూడా మీడియాకు ఇవ్వలేదు. ఎమ్మెల్యే మండలానికి వచ్చే విషయమై మీడియాకు కూడా సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచడంలో ఆంతర్యం ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదు.

ఉత్సాహంగా వైఎస్సార్‌సీపీ కేడర్

ప్రస్తుతం నియోజకవర్గ టీడీపీలో ఉన్న పరిస్థితులు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా మారాయి. గత ఎన్నికల్లో కేవలం 5 శాతం ఓట్లతో రాష్ట్రంలో అధికారం కోల్పోయిన వైఎస్సార్‌సీపీ ప్రస్తుతం ఉత్సాహంగా ఉంది. నియోజకవర్గంలో ప్రజాబలం ఉన్న నాయకులను మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆయా మండలాలకు కన్వీనర్లుగా నియమించారు. ఏ సమస్య వచ్చినా ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఆయన ఇంటికి నియోజకవర్గంలో ప్రతి సామాన్యుడు వెళ్లి నేరుగా కలిసి సమస్య చెప్పుకునే అవకాశం ఉంది. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలు, నాయకులకు ఏ ఆపద వచ్చినా ఆయన వెంటనే స్పందిస్తారు. వీటికితోడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివద్ధి పనులు కూడా ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. అధికారం చేపట్టి సంవత్సరం కావస్తున్నా ఎలాంటి అభివృద్ధి పనులు, సంక్షేమం పట్టని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కూటమి సర్కార్‌పై కోవూరులో మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఈ నెల 4న నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమం సూపర్ సక్సెస్ కావడంతో వైఎస్సార్‌సీపీ కేడర్‌లో ఉత్సాహం రెట్టింపు అయింది.

మంచినీటి బోరు, పైపులైన్లు ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని మూడోవార్డు దుర్గానగర్‌లో నూతనంగా నిర్మించిన తాగునీటి బోరు, పైపులైన్లను కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి శనివారం ప్రారంభించారు. ఇటీవల మూడోవార్డు పరిధిలో మంచినీటి పైపులైన్లు పగిలిపోయిన విషయాన్ని స్థానిక కౌన్సిలర్ ప్రత్యూష ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె నుడా నిధులు రూ.6లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో తాగునీటి బోరు, పైపులైన్ల నిర్మాణ పనులు చేపట్టారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

పొదలకూరు : మండలంలోని అమ్మవారిపాళెంలో రూ.20లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏడాది కాలంలోనే సర్వేపల్లి నియోజకవర్గంలో రూ.123 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు వెల్లడించారు. ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు మస్తాన్‌బాబు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నేత్రదానం


సుబ్బరామయ్య(ఫైల్)

విడవలూరు: స్థానిక కామాక్షినగర్ కాలనీకి చెందిన పోట్లపూడి సుబ్బరామయ్య(67) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు విడవలూరుకు చెందిన మన సేవా సంస్థ వ్యవస్థాపకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో నెల్లూరు మోడరన్ ఐ ఆస్పత్రికి దానం చేశారు. ఐ టెక్నీషియన్ నాగేశ్వరరావు నేత్రాలను సేకరించారు.

క్లుప్తంగా

వైభవంగా శ్రీవారికి పల్లకిసేవ



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని లక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకిసేవ జరిపారు. భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

'తన పేరుపై వేరొకరు లోన్ తీసుకున్నారు'

- పోలీసులకు ఫిర్యాదు

నెల్లూరు సిటీ: లోన్ తీసుకుని కట్టడం లేదంటూ ఓ కంపెనీకి చెందిన వారు బెదిరించడంతో ఆరా తీయగా వేరే వ్యక్తి లోన్ తీసుకున్నట్లు తేలడంతో రూరల్ పోలీసులకు బాధితుడు శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉప్పుటూరు గ్రామానికి చెందిన రాపూరు హరిబాబు ఓ రియల్‌ఎస్టేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీ నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌కు చెందిన లోన్ క్లియర్ చేయలేదని హరిబాబుకు ఫోన్ వచ్చింది. తాను ఎటువంటి లోన్ తీసుకోలేదని చెప్పినా చెల్లించాల్సిందేనని బెదిరించారు. దీంతో లోన్‌కు సంబంధించిన వివరాలు పంపాలని హరిబాబు ఆ ఏజెంట్ ను కోరారు. వారు పంపగా ఆధార్‌కార్డులో తిరుపతి అడ్రస్సు ఉంది. ఫొటో కూడా వేరే వ్యక్తిది ఉంది. దీంతో నగరంలోని బీవీనగర్‌కు చెందిన ఆ కంపెనీ ఏజెంట్‌ను సంప్రదించగా ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో వెంటనే రూరల్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత సైనికుల సమావేశం



నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో రిటైర్డ్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ అసోసియేషన్ (పారా మిలిటరీ విశ్రాంత సైనికులు) సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు నారాయణ స్వామి, పుల్లంశెట్టి సురేష్, కార్యదర్శి అంకుపల్లి పాల్, కోశాధికారి పి.స్వామిదాస్ పాల్గొని మాట్లాడారు. తమకు కార్యాలయ నిర్మాణం కోసం మినీబైపాస్‌రోడ్డులో రెండు సెంట్ల స్థలం మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులను కోరినట్లుగా తెలిపారు.

పారదర్శకంగా సేవలందించాలి


రక్తదాన శిబిరాలను పరిశీలిస్తున్న ఏడీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు బ్లడ్‌బ్యాంకులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా సేవలందించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న ఏసీఎస్‌ఆర్ ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకు, నారాయణ ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకు, రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకులను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలీ మాట్లాడుతూ ప్రైవేటు బ్లడ్‌బ్యాంకులు తాము సేకరించిన రక్తం యూనిట్లలో నిబంధనల ప్రకారం 30 శాతం ప్రభుత్వ ఆస్పత్రులకు ఇవ్వాలని తెలిపారు. రోగులకు అవసరమయ్యే రక్తాన్ని కొరత లేకుండా అందించేందుకు రక్తదాతలను ప్రోత్సహించాలని కోరారు. రక్తదానం పట్ల అవగాహన కల్పించేందుకు కళాశాలల్లోని యువతను, స్వచ్ఛంద సంస్థలను మోటివేట్ చేయాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఎయిడ్స్ నివారణ సిబ్బంది ఉన్నారు.

బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మహాసభ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నెల్లూరు యూనిట్ మహాసభ సమావేశం స్థానిక ఏనుగ సుందరరామిరెడ్డి కల్యాణ మండపంలో శనివారం జరిగింది. తొలుత డీసీసీ బ్యాంకులో పదవీ విరమణ చేసిన పలువురు ఉద్యోగులను సన్మానించారు. అనంతరం అసోసియేషన్ నూతన పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీవిద్య, ఉపాధ్యక్షులుగా బాలకృష్ణయ్య, సుధీర్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వర్ధన్‌రాజు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీలుగా సుబ్రహ్మణ్యం, హరిప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వెంకటరావు, జిల్లా సెక్రటరీగా సుబ్బారెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీగా రోహిత్, ట్రెజరర్‌గా కల్యాణ్ చక్రవర్తితో పాటు ఏడుగురు డైరెక్టర్లు, ఏడుగురు మహిళా సభ్యులను ఎన్నుకున్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు సన్మానం


మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండల తహసీల్దార్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న డీటీలు సునీల్‌కుమార్, కామాక్షి, ఆర్ఐ రమణయ్య, ఎస్ఓ రామ్‌మోహన్‌రావును తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న ఉద్యోగుల సేవలను కొనియాడారు.

అక్రమ కేసులపై పోరాటానికి సిద్ధం కావాలి


మాట్లాడుతున్న న్యాయవాదులు

కోవూరు: ప్రభుత్వం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతూ అక్రమ కేసులు పెడుతోందని, సామాజిక బాధ్యతగా న్యాయవాదులు వాటిపై పోరాటానికి సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు శ్యామాచార్యులు, చెంచురెడ్డి పిలుపునిచ్చారు. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో లీగల్ సెల్ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. తొలుత అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనలో మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అకృత్యాలు నానాటికి పెరిగిపోతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా లీగల్‌సెల్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కన్నా కక్షసాధింపు చర్యలకు ప్రాధాన్యత ఇస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలపై సద్భావం లేని చంద్రబాబు సర్కార్ వారిని వేధింపులకు గురి చేస్తోందని విమర్శించారు. కుట్ర పూరితంగా తప్పుడు కేసులు పెట్టి ఎంతో మందికి గ్రామాలు వదిలి వెళ్లే పరిస్థితిని కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాపై ఆంక్షలు పెట్టడం సరికాదని హితవుపలికారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అత్తిపల్లి అనూప్‌రెడ్డి , వైస్‌ఎంపీపీ నరసింహులురెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు కష్టకాలంలో ఎంతో ధైర్యాన్ని ఇచ్చారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని, చట్టాలను కాపాడాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చట్టానికి లోబడి పరిపాలన సాగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై మహిళ న్యాయవాదులు స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో న్యాయవాదులు శ్రీనివాసులురెడ్డి. బాలకృష్ణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.62 లక్షలతో పంటకాలువల అభివృద్ధి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ జలజాక్షి

మనుబోలు: పిడూరులోని పంట కాలువలను ఉపాధి నిధులు రూ.1,62,500 అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీడీఓ జలజాక్షి తెలిపారు. మండలంలోని పిడూరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రైతులకు అవసరమైన పంట కాలువల అభివృద్ధి పనులను ఉపాధిహామీ పథకం ద్వారా పూర్తి చేస్తున్నామన్నారు. పనులను నాణ్యతతో చేపట్టాలని కూలీలకు సూచించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని తెలిపారు. కూలీలకు దినసరి వేతనం రూ.300 అందేలా చూస్తామన్నారు. ఆమె వెంట ఏపీఓ రాజమ్మ, టీఏలు గుర్రప్ప, వేణు తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్ల దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్సై అబ్దుల్ రజాక్

నెల్లూరు(క్రైమ్): ఒంటరిగా వెళ్తున్న మహిళను చంపుతామని బెదిరించి సెల్‌ఫోన్లను దోచుకెళ్లిన ఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక చిన్నబజారు పోలీసుస్టేషన్‌లో ఎస్సై అబ్దుల్ రజాక్ శనివారం నిందితుల వివరాలను వెల్లడించారు. ముత్తుకూరు బస్టాండ్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఓ హాస్టల్ ఇన్‌చార్జిగా రమాదేవి పనిచేస్తున్నారు. ఈనెల 13వ తేదీ సాయంత్రం ఆమె పెట్రోల్ బంక్ వద్ద నుంచి హాస్టల్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా జ్యూస్‌షాపు వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై ఆమెను అడ్డగించారు. చంపుతామని బెదిరించి ఆమె చేతిలో ఉన్న రెండు సెల్‌ఫోన్లను దోచుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై అబ్దుల్ రజాక్ తన సిబ్బందితో సాంకేతిక ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

వాహన తనిఖీల్లో పట్టుబడిన నిందితులు

కాగా ఎస్సై అబ్దుల్ రజాక్ తన సిబ్బందితో ఎస్-2 థియేటర్ రోడ్డులో శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. విజయమహల్ గేటు వైపు నుంచి పల్సర్ బైక్‌పై వచ్చిన సంతపేట బుజ్జమ్మరేవుకు చెందిన ఎ.శ్రీకర్, ఎం.సిద్దులు పోలీసులను చూసి తప్పించుకునే క్రమంలో ఎస్సై తన సిబ్బందితో వారిని వెంబడించి పట్టుకున్నారు. ఎందుకు పారిపోతున్నారని ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో వారిని పోలీసుస్టేషన్‌కు తరలించి విచారించారు. రమాదేవిని బెదిరించి సెల్‌ఫోన్లను దోచుకెళ్లినట్లు నిందితులు అంగీకరించడంతో వారిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, పల్సర్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. శ్రీకర్‌పై సంతపేట పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం, కొట్లాట కేసులు, సిద్దుపై కొట్లాట కేసు ఉందని చెప్పారు. నిందితులను అరెస్ట్ చేసిన సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు అభినందించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నం చాముండేశ్వరిదేవి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 2 నుంచి మొదలయిన వేడుకలు 12 రోజుల పాటు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో ప్రధానమైన కల్యాణోత్సవం, సిరిమాను, తెప్పోత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని కృపాకటాక్షాలు పొందారు. ఆలయ సిబ్బందితో పాటు గ్రామస్తులు, ఉభయకర్తలు ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా తమవంతు సహకారం అందించి అమ్మవారికి కృపకుపాత్రులయ్యారు. బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుదాం

నెల్లూరు(బారకాసు): నెల్లూరులో వెయ్యి మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుదామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మెప్మా మహిళలు, అధికారులతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించి, మాట్లాడారు. నగర పరిధిలోని 160 మంది మెప్మా రిసోర్స్ పర్సన్స్‌కు ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది వేల ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అనంతరం టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి లేఅవుట్ అప్రూవల్స్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 41 అర్జీలు వచ్చాయని, వాటిలో 14 మందికి సంబంధించిన సమస్యలను పరిష్కరించామన్నారు. నుడాలో మొత్తం 53 లేఅవుట్ల అప్రూవల్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. టిడ్కో ఇళ్లను విజయదశమి నాటికి పూర్తి చేసి పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మెప్మా ఏఎండీ వెంకటేశ్వర్లు, ఎస్‌ఎంఎం శ్రీనివాసులు, మెప్మా పీడీ లీలారాణి, టిడ్కో ఎండీ సునీల్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ నందన్, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు సిటీ: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని భర్తపై భార్య రూరల్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. నారాయణరెడ్డిపేటకు చెందిన వనజాక్షికి రాజమండ్రికి చెందిన రామకృష్ణతో 2012లో వివాహమైంది. రామకృష్ణ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పూర్తిగా మద్యానికి బానిసైన రామకృష్ణ పనికి వెళ్లకుండా అదనపు కట్నం తీసుకురావాలని వనజాక్షిని వేధించడం చేశారు. దీంతో ఆమె రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొలం వివాదంలో తమ్ముడిపై దాడి

నెల్లూరు సిటీ: పొలం వివాదం నేపథ్యంలోలో తమ్ముడిపై అన్న దాడికి పాల్పడ్డారు. పోలీసుల వివరాలు మేరకు.. నెల్లూరు రూరల్ మండలం కందమూరుకు చెందిన వెంకటేశ్వర్లు, రవీంద్ర అన్నదమ్ముళ్లు. గత కొంత కాలంగా వారి మధ్య ఓ పొలానికి సంబంధించిన వివాదం సాగుతోంది. ఇటీవల పొలం సర్వే రిపోర్టు వచ్చిన క్రమంలో వారి మధ్య గొడవ తీవ్రస్థాయికి చేరింది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు తన చేతిలోని వాటర్ బాటిల్‌ను రవీంద్రపైకి విసరగా కంటికి తగిలి రక్తం రావడంతో వెంటనే చెన్నైలోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం


పొదలకూరు: ఎంపీడీఓ కార్యాలయంలో యోగాపై శిక్షణ


మనుబోలులో యోగా సాధన చేస్తున్న అధికారులు

పొదలకూరు : నిత్యం యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యకర జీవనం సాగించవచ్చని ఎంపీడీఓ డీవీ నరసింహారావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని 23 సచివాలయాల పరిధిలోని 207 ప్రాంతాల్లో 2,300 మందికి యోగాపై శనివారం శిక్షణ ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో యోగా గురువు పెంచలయ్య ఆధ్వర్యంలో అధికారులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి వినోద్‌బాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దినచర్యలో యోగా భాగం కావాలి

మనుబోలు: ప్రతిఒక్కరి దినచర్యలో యోగా భాగం కావాలని ఎంపీడీఓ జలజాక్షి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మనుబోలులోని కమ్యూనిటీ హాల్‌లో శనివారం యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నేటి యాంత్రిక జీవన శైలిలో ప్రతిరోజు కొద్దిసేపు యోగా, ధ్యానం చేయడం వల్ల ఒత్తిడిని అధిగమించడమే కాకుండా శరీరానికి మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శి గరుడయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోవూరు: స్థానిక టీఎస్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగాంధ్రలో భాగంగా అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సికిందర్ మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతతను పొందవచ్చని, విద్యార్థులు తమ దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ చిలకల శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో యోగాపై శిక్షణ ఇచ్చారు.


కోవూరు: టీఎస్‌సీ కళాశాలలో..

మండుతున్న కూరగాయల ధరలు



పొదలకూరు : కొద్దిరోజులుగా కూరగాయల ధరలు మండుతున్నాయి. కొన్ని రకాల కూరగాయలు ఓ మోస్తరుగా పెరగ్గా మరికొన్ని ఆకాశాన్ని తాకుతూ వినియోగదారులకు పట్టపగలే చుక్కలను చూపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని మార్కెట్లో ఒక ధర ఉంటే మండల కేంద్రాల్లో అదనంగా ధరలు పలుకున్నాయి. పచ్చిసరుకు నిల్వ ఉంటే నష్టం వాటిల్లుతుందని, 30 శాతం కూరగాయలు పాడవుతున్నందున అధిక ధరలకు విక్రయిస్తేనే గిట్టుబాటు అవుతుందని మండల కేంద్రాల్లోని వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా వేసవిలో కూరగాయల ధరలు పెరుగుతుంటాయి. నీటి లభ్యత సక్రమంగా లేక వేసవి తాపానికి కూరగాయల పంటలు వాడిపోయి దిగుబడి డిమాండ్ మేరకు ఉండదు. కూరగాయల్లో ప్రధానమైన టమాటా ధరలు అదుపులో ఉండగా, వంకాయల ధరలు పైపైకి ఎగబాగాయి. మండల కేంద్రాల్లో కిలో వంకాయలు రూ.80 నుంచి రూ.100 వరకు అమ్ముతున్నారు. గ్రామాలు, మండల కేంద్రాల్లో దాదాపు అన్ని రకాల కూరగాయల ధరలు కిలో రూ.60 నుంచి రూ.120 వరకు పలుకుతున్నాయి. బీన్స్, క్యారెట్, పచ్చిమిర్చి, తదితర కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయని వినియోగదారులు అంటున్నారు. ఆకు కూరలు కూడా సక్రమంగా లభ్యం కావడం లేదని, ధరలు పెంచినట్టుగా చెబుతున్నారు. కూరగాయలతో పాటు చికెన్ ధరలు కూడా పెరిగాయి. గ్రామాల్లో బ్రాయిలర్ చికెన్ కిలో రూ.220 నుంచి రూ.230 వరకు అమ్ముతున్నారు.

నారాయణ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్


నారాయణ స్కూల్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నెల్లూరు (టౌన్): భవన నిర్మాణం పూర్తి కాకుండానే తరగతులు నిర్వహిస్తున్న నారాయణ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్‌షరీఫ్ డిమాండ్ చేవారు. ఈ మేరకు ప్రశాంతినగర్‌లోని నారాయణ స్కూల్ ఎదుట ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణ స్కూల్‌కు అనుమతి లేకున్నా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పీడీఎస్‌యూ జిల్లా సెక్రటరీ షారూఖ్, నాయకులు మస్తాన్, నవీన్, హర్ష, ఏఐఎస్ఎఫ్ నాయకులు శివం, మౌళి పాల్గొన్నారు.